ప్రజాశక్తి

బుధవారం 18 అక్టోబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

కిముడుపల్లిలో సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో గంపరాయి పంచాయతీ కేంద్రంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిభిరంలో ప్రజలకు వైద్యాధి కారిణి సిందూరం, శంకర్ ఫౌండేషన్ వైద్యాధికారులు సర్వేశ్వర్‌రావు, నరసింహారెడ్డి, చంద్రశేఖర్‌లు వైద్య సేవలు అందించారు. అనంతరం కిముడుపల్లి పంచాయతీ సచివాలయంను ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ పారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగనన్న సురక్షతో ప్రభుత్వం వ్యాధుల బారిన పడిన పేదలకు ఉచిత వైద్యం అందిస్తుందన్నారు.సచివాలయం ప్రారంభోత్సవానికి ముగ్గురు గ్రామ వాలంటీర్లు హాజరు కాక పోవడంతో విధుల నుండి తొలగించాలని ఎంపీడీఓ ఎల్.పూర్ణయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కిముడుపల్లి సర్పంచ్ శోభారాణి, రాష్ట్ర వైస్సార్సీపీ కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు వంతల ఆనందరావు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

సచివాలయ సిబ్బంది

సమయపాలన పాటించకుంటే చర్యలు

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

- కిలగాడ, పర్రెడ, సొలభం -1 సిబ్బందికి జీతాలు నిలుపుదల

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:గ్రామ సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. కార్యాలయాలకు ఆలస్యంగా హాజరు కావడం, ముందుగానే కార్యాలయాలకు తాళం వేసి వెళ్లిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి 22 మండలాల ఎంపిడిఓలు, ఎంఇ ఓలు, ఉపాధి హామీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, ఆధార్ సీడింగ్, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల నిర్మాణాలు, మన బడి నాడు పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముంచింగ్‌పుట్టు మండలం కిలగాడ, పెదబయలు మండలం పర్రెడ, జి.మాడుగుల మండలం సొలభం-1 గ్రామ సచివాలయాలను డిఎల్‌డిఓ తనిఖీకి వెళ్లినపుడు సాయంత్రం ఐదు గంటలకు ముందే కార్యాలయాలకు తాళం వేసి ఉందని సంబంధిత సచివాలయం సిబ్బందికి జీతాలు నిలుపుదల చేయాలని ఎంపిడిఓలను ఆదేశించారు. అటవీ హక్కు పత్రాలు కలిగిన గిరిజన రైతులకు ఉపాధి పనులు కల్పించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఉపాధి పనుల కల్పనలో మారేడుమిల్లి, జి.కె.వీధి, రంపచోడవరం, జి.మాడుగల మండలాలో వెనుకబడి ఉన్నారని పురోగతి సాధించాలని స్పష్టం చేసారు. ప్రతీ పంచాయతీలో ఉపాధి పనులు గుర్తిచాలని ఆదేశించారు. జిల్లాలో 20వేల వరకు చెరువులు ఉన్నాయని, పనులు గుర్తించి పెద్ద ఎత్తున ఉపాధి పనులు నిర్వహించాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్లు పెంచాలని సూచించారు. ఉపాధి కూలీలకు ఆధార్ సీడింగ్ చేయలన్నారు.మంజూరు చేసిన బర్త్ సర్టిఫికేట్లను వెంటనే లబ్దిదారులకు పంపిణీ చేయాలని చెప్పారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణపు పనుల బిల్లులు ఎక్కడా పెండింగ్ లేవన్నారు. ప్రాధన్యతా భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. భవనాలు లేని పాఠశాలల వివరాలను ఈనెల 21 వ తేదీలోపు సమర్పిస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. మన బడి నాడు నేడు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పిఒ వి. అభిషేక్, రంపచోడవరం పి ఓ సూరజ్ గనోరే, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, డిఎల్‌డిఓ శాంతలక్ష్మి, ఉపాధి హామీ ఎపిడి జె.గిరిబాబు, డిబిటి మేనేజర్ నరేష్, 22 మండలాల ఎంపిడి ఓలు, ఎంఇఓలు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న పిఒ అభిషేక్

పనులు వేగంగా పూర్తి చేయండి

ప్రజాశక్తి-జి.మాడుగుల:కొత్తపల్లి జలపాతం ఆధునీకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి, అభిషేక్ ఆదేశించారు. మంగళవారం కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించి జలపాతం ఆధునీకరణ పనులను పరిశీలించారు. పర్యాటక సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పనులు వేగంగా పూర్తి చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో పటిష్టమైన నాణ్యతలో పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డివి ఆర్ ఎం. రాజు, ఏఈ దేముళ్ళు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చిన్నారి మృతి

రోధిస్తున్న తల్లి

ప్రజాశక్తి -హుకుంపేట:అనారోగ్యంతో పిల్లల మరణాలు రోజురోజుకి మండలంలో పెరిగి పోతున్నాయి. అనారోగ్యంతో చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని రంగశీల పంచాయతీ బోడిగాపుట్టు గ్రామంలో చోటు చేసుకుంది. తల్లి దండ్రులు కొర్ర చిన్నమ్మి, లొల్లి రాము తెలిపిన వివరాల ప్రకారం...సోమవారం నుంచి కోర్ర ఏంజిల్ (4) పాప వాంతులు జ్వరంతో అస్వస్థతకు గురైంది. మంగళవారం చనిపోయింది. పాప మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అరకొర రేషన్ పంపిణీపై ధర్నా

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేస్తున్నగిరిజనులు

ప్రజాశక్తి-కూనవరం :మండలంలోని కూటూరు గ్రామపంచాయతీ పరిధిలోని కూటూరు గట్టు, కొపిరిమెట్ట, కల్లెంగమద్ది, ముల్లూరు గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు సెప్టెంబర్ నెల రేషన్ బియ్యం ఇవ్వలేదని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య ఆరోపించారు. అరకొర రేషన్ పంపిణీపై మంగళవారం స్థానిక సచివాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాయం సీతారామయ్య మాట్లాడుతూ పలువురు లబ్ధిదారులకు సెప్టెంబర్ నెల రేషన్‌బియ్యాన్ని ఎండియు వాహనదారు పూసం ప్రసాద్ ఇవ్వడం లేదన్నారు. ముఖ్యంగా కొండరెడ్లకు, గిరిజనులకు కొంతమందికి మాత్రమే రేషన్ ఇచ్చారని, మిగిలిన లబ్ధిదారులను రెండు మూడురోజులుగా తిప్పుతున్నారని ఆరోపంచారు. ముఖ్యంగా కొండరెడ్ల రేషన్‌లబ్ధిదారులను రేషన్ కోసం తిప్పిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే రేషన్ బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, ఎంపిటిసిలు ధర్మల అమ్మాజీ, సర్పంచులు మడకం నాగమణి, బి.వెంకమ్మ, అశోక్, కుమ్మారు మాజీ ఎంపిటిసి సవలం నారాయణ, భూమిరెడ్డి, రేషన్‌కార్డుదారులు పాల్గొన్నారు.

రోడ్లు పాడుచేస్తే ఊరుకోం

మాట్లాడుతున్న సర్పంచ్ సోమన్నదొర

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని కాకరపాడు ఐటిడిఎ కాలనీ నుంచి చీడిపాలెం పంచాయతీ కేంద్రం వరకూ నూతనంగా నిర్మించిన రహదారిలో దమ్ము పట్టే సెట్లతో ట్రాక్టర్లను తిప్పితే ఒప్పుకోబోమని సర్పంచి నత్తూరు సోమన్నదొర హెచ్చరించారు. మంగళవారం చీడిపాలెంలో గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. దమ్ము సెట్లను బిగించిన ట్రాక్టర్లు తిరగడం వల్ల రోడ్లు పాడౌతున్నాయన్నారు. గతంలోనూ రహదారి మొత్తం ఇలాగే దమ్ముసెట్ తిరగడం వల్ల ముక్కలుముక్కలుగా తయారైందన్నారు. ఇపుడు కొత్తగా నిర్మించిన రోడ్డుపై దమ్ముసెట్ ఉన్న ట్రాక్టర్లను తిప్పొద్దని వేడుకున్నారు.కాదు, కూడదని ఎవరైనా వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. విషయాన్ని తహాశీల్దార్, ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రహదారిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందరూ, ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

22లోపు సమస్యలు పరిష్కరించకుంటే

టూరిజం కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-అరకులోయ:టూరిజం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈనెల 22లోపు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని కాంట్రాక్ట్, మాన్ పవర్, డైలీ వేజ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి. గంగరాజు, మంతల బాబురావు, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్. ఆర్.వి.నరసింహ, వి,అంజలిరావు, ధర్మలు తెల్చి చెప్పరు. ఈ మేరకు అరకులోయ లోని గిరిజన సంఘం భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, టూరిజం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని వారు స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 2010 నుంచి వివిధ రూపాల్లో అనేక ఆందోళనలు చేపడుతున్నా టూరిజం యాజమాన్యం కనీసం స్పందించలేదన్నారు. అప్పటి టూరిజం చైర్మన్ చందన ఖాన్ తో కుదుర్చుకున్న ఒప్పందాల్లో ఏ ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని వారు స్పష్టం చేశారు. గత ఏడాది అప్పటి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభ రవిబాబు సమక్షంలో టూరిజం కార్మికులు ఆ శాఖ రాష్ట్ర యాజమాన్యంతో సమస్యలపై చర్చించినప్పటికీ ఇప్పటికి స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో సమ్మె తప్ప మరో మార్గం లేదని భావించి ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మెకు నిర్ణయం తీసుకున్నట్లు వారు స్పష్టం చేశారు.ప్రతి ఏటా కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. 25 ఏళ్ల నుంచి కార్మికులందరూ చాలీచాలని వేతనంతోనే పనిచేస్తున్నట్లు వారు తెలిపారు. పీజీలు చదివిన గిరిజన కార్మికులు సూపర్వైజర్ వంటి ప్రమోషన్లకు నోచుకోలేదన్నారు. టూరిజం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, 2010లో టూరిజం కార్పొరేషన్ యాజమాన్యంతో చేసిన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, కార్మికులందరికి హెచ్ఆర్ పాలసీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి విద్యా అర్హతను బట్టి కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులకు పదోన్నతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.మృతి చెందిన కార్మికుల కుటుంబానికి అదే కేటగిరీలో తక్షణమే ఉద్యోగం కల్పించాలని, డైలీ వేస్ కార్మికులందరినీ ఆప్కస్‌లో కలపాలని, కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులందరినీ గ్రాడ్యుటి అమలు చేయాలన్నారు. కార్మికులకు బస్సు పాస్, ఏజెన్సీ అలవెన్సులు, వాషింగ్ అలవెన్సులు పెంచాలని, యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అరకులోయ మయూరి, పున్నమి, అతిథి గృహాల కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టూరిజం కార్మికుల సంఘం నాయకులు

గుండెపోటుతో వాలంటీర్ మృతి

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని కొండిబ పంచాయతీ పరిధి లింబగుడ గ్రామానికి చెందిన వాలంటీర్ గుబాయి. రవికుమార్ (32) గుండెపోటుతో మృతి చెందాడు. తన కుటుంబ సభ్యులతో సోమవారం బొర్రా గుహాలు, కట్టికి జలపాతం తిలకించేందుకు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో హఠత్తుగా గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు సుంకరమట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అరకు ఏరియా ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు పరిస్థితి విషమంగా ఉండటంతో అందుబాటులో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం జిల్లా ఎస్ కోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కెజిహెచ్‌కు తరలించేందుకు అంబులెన్స్ ఎక్కిస్తుండగా కుపకూలి అక్కడికక్కడే వాలంటీర్ మృతి చెందాడు. వైద్య అందకపోవ్వడంతోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ దీసరి. గంగరాజు, ఎంపిపి శెట్టి. నీలవేణి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ కొర్రా రామలక్ష్మి, సర్పంచ్ మొస్యలు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మృతుడు రవికుమార్ (ఫైల్)

మాట్లాడుతున్న చైర్మన్ శంకరరావు

గిరిజనుల సమస్యలపై దృష్టి

- ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

ప్రజాశక్తి- అనంతగిరి:గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై ఎస్టి కమిషన్ స్పందిస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి. శంకరరావు అన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ఆయన మంగళవారం అనంతగిరి మండలంలో పర్యటించారు. కాశీపట్నంలో కొత్తమ్మ తల్లి గుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తూరు కస్తూరిబా పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుందన్నారు.ఇందులో భాగంగానే ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రాథమిక వైద్యంతో పాటు ప్రత్యేక వైద్యాన్ని ప్రజల ముంగిటకే తీసుకొని వచ్చిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.టూరిజం కార్మికుల సమస్యలను యూనియన్ ప్రతినిధులు నరసింహ, సోమేష్, బుద్ధరాజు సన్యాసమ్మ తదితరులు ఎస్టీ కమిషన్ చైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ మండల ప్రతినిధులు రాంబాబు, భాస్కర్, మల్లేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. పుట్టచింత గ్రామంలో ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన వంతల మోహన్ కుటుంబ సభ్యులను కమిషన్ సభ్యురాలు కొర్రా. రామలక్ష్మి, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరిలతో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సారా సీతయ్య, ఎంపీటీసీ సభ్యులు మూతిబోయిన సన్యాసిరావు, వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, వైస్ సర్పంచ్ నరేంద్ర కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు, సహాయ గిరిజన సంక్షేమ అధికారి వెంకటరమణ, ఎంపీడీవో హర్షిత్, తహసిల్దార్ రాంబాయి పాల్గొన్నారు.

ముసురుమిల్లి కాలువ ద్వారా అందని సాగునీరు

కొనవాడిపోతున్న వరిపైర్లు

ప్రజాశక్తి -మారేడుమిల్లి : వర్షాభావ పరిస్థితులు ఒకవైపు, ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువ ద్వారా ఆయకట్టు భూములకు సాగునీరు అందక వరిపొలాలు బీటలు వారిపోతున్నాయని ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. దేవిపట్నం మండలం దేవారం, శరభవరం పంచాయతీ పరిధిలోని వరిపొలాలను, ముసురుమిల్లి పంటకాలువను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ముసురుమిల్లి ప్రాజెక్టు కెనాల్ ద్వారా దేవారం, శరభవరం పంచాయతీ పరిధి లోని పంటపొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. దీంతో పొలాల్లోని పైర్లు ఎండిపోయి, రైతన్నలు కంట కన్నీరు కారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరితగతిన ముసురుమిల్లి కాలువ ద్వారా పంటలకు సాగునీరు అందించి, పైర్లను పరిరక్షించాలని కోరారు.దీనిపై ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. సాగునీరు అందించలేని పరిస్థితి ఉంటే, ఆయాపంచాయతీలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించి, బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ముసురుమిల్లి కాలువను చూపుతున్న శేఖర్

బీటలు వారిన వరి పొలం

చంద్రబాబు ఆరోగ్యానికి ప్రభుత్వానిదే బాధ్యత

ప్రజాశక్తి -కొయ్యూరు : అక్రమ కేసులో అరెస్టయి జైలులో ఉన్న చంద్రబాబు ఆరోగ్యానికి ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి.ప్రసాద్ అన్నారు. మంగళవారం చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ కొయ్యూరు దుర్గా మల్లేశ్వరి ఆలయానికి పాదయాత్రగా వెళ్లిన తెలుగు మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులన్నీ ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, తప్పుడు కేసులో చంద్రబాబును అరెస్ట్ చేయడంతోపాటు 37రోజులౌతున్నా ఎటువంటి ఆధారాలను చూప కుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు.జైలులో చంద్రబాబు ఆరోగ్యంపై కుటుంబ సభ్యులతో పాటు తెలుగుదేశం శ్రేణులు ఆందోళన చెందుతుంటే, వైసిపి నేతలు వ్యంగ్యపూరిత విమర్శలు చేయడం బాధాకర మన్నారు. కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, మేడిపోయిన చిన్న, మొట్టడం వీరయ్య దొర,మాజీ ఎంపిటిసి మాకాడ సరస్వతి, రాము, గాలి సత్యవతి, కించే సత్యవతి, వాసం రాము, కె బాసి, మొట్టడం నాగార్జున, ఉప్పల రాజేష్ పాల్గొన్నారు.

నడిపాలెంలో బాబుతో నేను నిరసనలో టిడిపి శ్రేణులు

కొయ్యూరులో నిరసన వ్యక్తం చేస్తున్న తెలుగు మహిళలు

నడింపాలెంలో 'బాబుతో నేను' నిరసన

కొయ్యూరు : చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా మండలంలోని నడింపాలెం పంచాయతీ నల్లగొండ గ్రామంలో మహిళలు నిరసన తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎంవివి.ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి లోతా భీమరాజు, పార్టీ సీనియర్ నేత లోత అప్పలకొండ అధ్యక్షతన బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా రచ్చబండ నిర్వహించారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి పాడేరు ప్రధాన కార్యదర్శి అనిశెట్టి చిరంజీవి, కాకూరి చంద్రరావు, సర్పంచ్ పాంగి రాజుబాబు, మంట హరిప్రసాద్, జె.వి. రమణ టిపిడబ్ల్యు అరకు పార్లమెంట్ ప్రెసిడెంట్ చడ్డా రాంబాబు, చడ్డా దేముడు, బేరా నారాయణరావు, మాజీ సర్పంచ్ లోతా ధర్మరాజు పాల్గొన్నారు.

సిఆర్‌పిఎఫ్ సిబ్బంది 'స్వచ్ఛతా హి సేవ'

వీధులను శుభ్రం చేస్తున్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు

ప్రజాశక్తి -మోతుగూడెం : వై.రామవరం మండలం డొంకరాయి గ్రామంలో సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డొంకరాయి ఎస్ఐ శివకుమార్, సిబ్బందితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ కుమార్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాక వ్యాధులకు కారణమైన దోమలు విజృంభించకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత అవసరమన్నారు. పారిశుధ్య పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వీధులను పరిశుభ్రం చేశారు. సిఆర్‌పిఎఫ్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పెదమాకవరం సమస్యలపై ఎంపీకి వినతి

వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

ప్రజాశక్తి- కొయ్యూరు : మండలంలోని పెదమాకవరం పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సర్పంచి సెగ్గే నూకాలమ్మ, ఎంపిటిసి సడ్డా మల్లేశ్వరి కోరారు. గ్రామస్తులతో కలిసి, అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని కలిసి వినతిపత్రం అందజేశారు. రామరాజుపాలెం నుంచి గానుగుల గ్రామం వరకూ బిటిరోడ్డు నిర్మాణం చేపట్టాలని, అలాగే అక్కడ ఉన్న కాలువపై వంతెన నిర్మించాలని కోరారు. పంచాయతీలో బస్ షెల్టర్, కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో తాగునీటి సౌకర్యం, సిసి రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ఎంపిడిఓను సత్కరిస్తున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు

ప్రజాశక్తి-విఆర్.పురం: బాల్య వివాహాలు అనర్థం, చట్టరీత్యా నేరమని ఎంపిడిఓ ఫణీంద్రకుమార్ అన్నారు. మంగళవారం రేఖపల్లి వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య నెలవారీ సమావేశం జరిగింది. తొలిసారిగా ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపిడిఓ మాట్లాడుతూ, అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21ఏళ్లు నిండిన తర్వాత వివాహాలు జరిపించాలన్నారు. తక్కువ వయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల ఎన్నో అనర్థాలు చేకూరుతాయన్నారు. బాల్యవివాహాల రహిత భారత్‌ను తీర్చిదిద్దడంలో భాగస్వాములమౌతామని మహిళా సమాఖ్య ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. మహిళా సంఘాల ప్రతినిధులతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఎంపిడిఓను సత్కరించారు. సమావేశంలో ఏపిఎం, సిసిలు, ఎంఎంఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

20న హుకుంపేట మండల సమావేశం

ప్రజాశక్తి-హుకుంపేట: మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఆర్.వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 శాఖల పనితీరు, సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అధికారులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో అంధత్వ నివారణ సంస్థ, అల్లూరి సీతారామరాజు మన్యం, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 350 మందికి కంటి రోగులకు పరీక్షలు చేయగా, 46 మందికి కంటి ఆపరేషన్ అవసరం అని గుర్తించారు. వీరిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్సులో తరలించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తమెట్రి ఆఫీసర్ సురేష్, క్యాంప్ కోఆర్డినేటర్ అశ్విని కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

19, 20 తేదీలలో ప్రెస్ అకాడమీ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి -పాడేరు: ఈ నెల 19, 20 తేదీలలో ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు జిల్లాలో పర్యటిస్తారు. 19వ తేదీ గురువారం సాయంత్రం పార్వతీపురం నుండి బయలు దేరుకొని రాత్రి బస చేస్తారు. 20వ తేదీ ఉదయం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొని మధ్యాహ్నం కాకినాడ జిల్లా అన్నవరం బయలుదేరి వెళతారు. ఈ మేరకు సి.ఆర్. మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కార్యాలయం అధికారులు ప్రకటించారు.

అర్ధాంతరంగా ముగిసిన 'ఉక్కు' బోనస్ చర్చలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బోనస్ చెల్లింపు కోసం ఢిల్లీలో ఏర్పాటుచేసిన సమావేశం అర్ధాంతరంగా ముగిసిందని సిఐటియు ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యారామ్ తెలిపారు. కేవలం రూ.23 వేల మాత్రమే చెల్లిస్తామని యాజమాన్యం పట్టుబట్టడంతో కార్మిక సంఘాలు ఐక్యంగా దీన్ని తిరస్కరించాయని తెలిపారు. గతం కంటే ఎక్కువ బోనస్ ఇవ్వించాలని కార్మిక సంఘాలన్నీ పట్టుబట్టాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కులో నూతన వేతన ఒప్పందం లేక యువ కార్మికులు, సీనియర్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి సమయంలో బోనస్ ఆశలపై నీళ్ల చల్లడం సరైన పద్ధతి కాదన్నారు. పోరాటం చేయకుండా చర్చలతోనే పరిష్కారం కావాలని ప్రయత్నిస్తే ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల బోనస్ కోసం పోరాటం తప్పదని, కార్మిక సంఘాలన్నీ ఈ పోరాటానికి సహకరించాలని కోరారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి- ములగాడ : పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన మల్కాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టిపల్లి సత్యనారాయణ, గుడాల రాంబాబు మాట్లాడుతూ, ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేయకుండా, ప్రభుత్వాలు అవినీతిని అరికడితే సామాన్యులపై భారాలు వేయాల్సిన అవసరముండదన్నారు. రాజకీయ అవినీతిపరులు, కార్పొరేట్లు, పాలకులు కుమ్మక్కై రూ. 2, రూ.3 కొనాల్సిన విద్యుత్తును బహిరంగంగా మార్కెట్లో రూ.10 నుంచి రూ.20కి కొంటున్నారని, ఇందులో భారీ ఎత్తున అవినీతి ఉందని, ప్రజలు మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నూనెల సూరిబాబు, గండి అప్పారావు, డి.గోపాలరావు, బి.వెంకట్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పెద్దపీట

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి వెల్లడించారు. జివిఎంసి 72వ వార్డు పరిధిలో రూ.74.80 లక్షలతో అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మౌలిక సౌకర్యాలైన రోడ్లు, డ్రైనేజీలకు నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి సిరెడ్డి వాసు, సిపిఐ నాయకులు జి.ఆనంద్, వార్డు పెద్దలు వీరయ్య, రామిరెడ్డి, పరశురామ్, ప్రభుకుమార్, డిఇ మణి కుమార్, ఎఇ భాగ్యశ్రీ పాల్గొన్నారు.

నేత్ర పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి -ములగాడ : సెయింట్ ఆన్స్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం, ఐక్యమిస్ ఆధ్వర్యాన రెండు రోజుల ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌జె.శిరీష మాట్లాడారు. కంటి విషయంలో సొంత వైద్యం పనికి రాదని, డాక్టర్ల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

మందులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని, ఆసుపత్రులకు వెళ్లలేక ఇంటికే పరిమితం అవుతున్న అనేక మందికి మెరుగైన వైద్యం అందుతుందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. పాడేరు మండలం గుత్తులపుట్టు గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సీఎం ఈ కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు.. ఈ శిబిరంలో ఏడు రకాల పరీక్షలు ఉచితంగా చేసి, మందులు ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాల వైద్యులు సిఫార్సు మేరకు ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్ లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. వైద్యం పొందుతున్న సమయంలో ప్రభుత్వమే వైయస్సార్ ఆరోగ్య ఆసరా కింద డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు. వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందిన అనంతరం వాడాల్సిన కోర్సుకు సంబంధించి ఆరోగ్య కార్యకర్తలు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గొల్లోరి నీలకంఠం, సాగిన బాబురావు పడాల్, కిల్లో ఈశ్వరమ్మ, స్థానిక ఎంపిటీసీ దూసూరు సన్యాసిరావు, మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగళన్న దొర, సర్పంచులు పాంగి రాంబాబు, వంతాల రాంబాబు, సచివాలయ కన్వీనర్లు కూడా సుశీల, మాదల మోహనరావు పాల్గొన్నారు.

చింతపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని వైసిపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి అన్నారు. కొత్తపాలెం పంచాయతీ సచివాలయం 1 లో సర్పంచ్ వనగల సోమరత్నం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. స్థానిక ఎంపీపీ కోరాబు అనుష దేవి, ఎంపీడీవో ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ గోపి నాయక శారదలతో కలిసి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మారుమూల ప్రజల ప్రజారోగ్యానికి రక్ష అన్నారు. మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు, పంచాయతీ కార్యదర్శి రాజేష్, మాజీ ఎంపీపీ వంతల బాబురావు, మాజీ వైస్ ఎంపీపీ భూసరి కృష్ణారావు, గోపాల్ పాల్గొన్నారు

ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి -ములగాడ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై విశాఖ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన 59వ వార్డు పరిధి నెహ్రూనగర్ లేబర్ జంక్షన్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మల్కాపురం జోన్ గౌరవాధ్యక్షులు కె.పెంటారావు మాట్లాడుతూ, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు సుమారు రూ.850 కోట్లను ఇతర పథకాలకు మళ్లించి భవననిర్మాణ కార్మికులకు అన్యాయం చేశారన్నారు. అధికారం చేపట్టి నాలుగేళ్లు దాటినా భవన నిర్మాణ కార్మికుల ప్రసూతి, వివాహ, మృతిచెందిన వారికి క్లెయిములు మంజూరు చేయకుండా ఏగనామం పెట్టారని విమర్శించారు. సంక్షేమ బోర్డులో రూ.వేల కోట్లు ఉన్నా భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అందటం లేదన్నారు. కరోనా కాలంలో సంక్షేమ బోర్డు లేబరు కార్డు ఉన్న ప్రతి భవననిర్మాణ కార్మికునికీ రూ.10 వేలు చొప్పున సహాయం చేస్తానని చెప్పి విస్మరించారన్నారు. కార్డు ఉండి 60 సంవత్సరాలు దాటిన కార్మికులందరికీ ప్రతి నెలా రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, వై.గంగాధర్, పైడినాయుడు, రాజు, సత్యం, రాజేష్, ఈశ్వరరావు, కుమార్, శ్రీను, సురేష్, సత్యం పాల్గొన్నారు.

బాలికను గర్భవతిని చేసిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-లీగల్ : ప్రేమ, పెళ్లి పేరుతో బాలికను గర్భవతిని చేసి, ఆమెకు కుమారుడు కలగడానికి కారకుడైన వ్యక్తికి 25 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధిత బాలికకు ప్రభుత్వం తరపున రూ.7 లక్షలు ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాల ప్రకారం... ఉమ్మడి విశాఖ జిల్లా ప్రస్తుతం ఎఎస్ఆర్ జిల్లా చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీ పరిధిలోని తోటరాజు బండ గ్రామానికి చెందిన నిందితుడు జాత రాంబాబు (21) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. పేదలపుట్టు గ్రామానికి చెందిన బాధితురాలు (15)కు రాంబాబుతో పరిచయం ఏర్పడింది. బాలికకు మాయ మాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఒక మగ బిడ్డకు జన్మనిచ్చింది. బాలిక గర్భం దాల్చడానికి తాను కారణం కాదని వేరే వ్యక్తితో ఆమె సంబంధం ఉందంటూ రాంబాబు తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో 2018 ఫిబ్రవరి 14వ తేదీన బాలిక చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు ప్రాథమిక విచారణ చేసి నిందితునిపై సెక్షన్376(1), పోక్సో చట్టం సెక్షన్ 5(1) కింద కేసు నమోదుచేసి నేరాభియోగ పత్రాన్ని కోర్టులో దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -గోపాలపట్నం : ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన భగత్‌సింగ్‌నగర్ జంక్షన్లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... దేవ్ సతీష్‌కుమార్ (35) కార్పెంటర్ పనులు చేసుకుంటూ 89 వార్డు పరిధి ఆదర్శనగర్‌లో నివాసముంటున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో పని నిమిత్తం భగత్‌సింగ్‌నగర్ మీదుగా వెళ్తున్నాడు. అదే సమయంలో భవన నిర్మాణ వ్యర్థాలతో ఒక ట్రాక్టర్ వెనుకనే వెళ్తోంది. భగత్‌సింగ్‌నగర్ జంక్షన్ దాటిన తర్వాత ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో సతీష్ కుమార్ ట్రాక్టర్ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, స్థానిక నాయకులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ: రోడ్డు ప్రమాదంలో ఈ నెల 15వ తేదీన గాయపడిన వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి ఆరో వార్డు పరిధి బక్కన్నపాలేనికి చెందిన పి.గోపి (58) ఓ ప్రైవేట్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన ద్విచక్ర వాహనంపై ఆనందపురం వైపు వెళుతుండగా మారికవలస వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకున్నాయి. గోపి కింద పడి గాయాలపాలయ్యాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు హెచ్‌సి శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.10 కోట్లు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నకు హుండీ ద్వారా భక్తులు 20 రోజులకు సమర్పించిన కానుకలను మంగళవారం దేవస్థానం ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో లెక్కించారు. నగదు రూ.1,10,29,970, బంగారం 5 గ్రాములు, వెండి 7 కేజీల 50 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సహాయ కార్య నిర్వహణాధికారులు రమణమూర్తి, నరసింహవర్మ, డి.భ్రమరాంబ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. లెక్కింపు సమయంలో ట్రస్టు బోర్డు సభ్యులు దొడ్డి రమణ నిబంధనలకు విరుద్ధంగా చొక్కాతో రావడం కనిపించింది.

20న పద్మనాభం మండల సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 20వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

టెన్నిస్‌లో బంగారు పతకాలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస ఎన్నారై వైద్య విద్యా సంస్థ విద్యార్థినిలకు టెన్నిస్‌లో రెండు బంగారు పతకాలు లభించాయి. డాక్టర్ వైఎస్ఆర్ వైద్య విశ్వ విద్యాలయం 23వ వార్షిక అంతర్ కళాశాల మహిళల ఆటల పోటీల్లో స్థానిక సంగివలస ఎన్నారై వైద్య విద్యా సంస్థ విద్యార్థినిలు బిఎల్ఎస్.రితిక వ్యక్తి గత టెన్నిస్ పోటీలో బంగారు పతకం సాధించగా, యశస్వినితో జంటగా డబుల్స్‌లో కూడా బంగారు పతకం సాధించింట్లు ఎన్నారై వైద్య విద్యా సంస్థ డీన్ డాక్టర్ పివి.సుధాకర్, సిఇఒ నిరంజన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, కార్యాలయాధికారి శివ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను మంగళవారం కళాశాలలో అభినందించారు.

లఘు చిత్ర ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన విశాఖ పౌర గ్రంథాలయంలో రెండు రోజుల లఘు చిత్రాల ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు ఎన్ఎడి పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, దేశ విదేశాలలో అవార్డులు పొందిన లఘు చిత్రాలను ఉచితంగా ప్రదర్శిస్తున్నామని తెలిపారు.

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఇజ్రాయిల్ దాడిని ఖండించండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న సైనిక దిగ్బంధనాన్ని తక్షణమే విరమించాలని, ఐక్యరాజ్య సమితి తీర్మానాల ప్రకారం పాలస్తీనా భూభాగాల నుంచి వెంటనే ఇజ్రాయిల్ వైదొలగాలని విశాఖ పౌర ప్రజా సంఘాలు, భారత బచావో కమిటీలు కోరాయి. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆయా సంఘాల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు విఎస్.కృష్ణ, భారత బచావో విశాఖ జిల్లా నాయకులు పి.చంద్రశేఖర్, పౌర ప్రజా సంఘాల వేదిక నాయకులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బడా కార్పొరేట్ కంపెనీలు, సామ్రాజ్యవాద శక్తులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సహజ వనరులను, మానవ శ్రమను, వినియోగదారుల మార్కెట్లను కొల్లగొట్టే లక్ష్యంతో ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలకు తెరలేపుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పైడిరాజు, టి.శ్రీరామమూర్తి, ఎస్‌కె.రెహమాన్, వై.నూకరాజు, ఎస్.వెంకటలక్ష్మి, జి.సీతామహాలక్ష్మి, వేమన శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వర్లు, కె.మల్లయ్య, యు.నిర్మల, సలీం, పుష్ప, డి.వెంకట్రావు, సృజన పాల్గొన్నారు.

తెలంగాణ తరహా పథకాలను అమలుచేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న, అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జెటి.రామారావు, తలారి సురేష్, మద్యంశెట్టి సురేష్, కరణం రామ్మోహన్ నాయుడు, బత్తుల నీలకంఠం, ఆర్.తాతారావు కోరారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎపిలో రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తమ పార్టీ పోటీ చేయనుందన్నారు. ఎపిలో పాలకులు అప్పులతో పాలన నడిపిస్తున్నారని, తాము అధికారంలోకొస్తే మిగులు బడ్జెట్ ఉండేలా చూస్తామని అన్నారు.

వివేకానంద సంస్థ పనితీరు అభినందనీయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతి సంవత్సరం తమ ఆశ్రమవాసులకు బంగారాన్ని కొనడం, వృద్ధులను తల్లిదండ్రులు వలే చూసుకోవడం వంటి చర్యలు చేపడుతున్న శ్రీ వివేకానంద సంస్థ నిర్వాహకులు అభినందనీయులని దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. చిలకపేటలో ఉన్న శ్రీ స్వామి వివేకానంద ఆశ్రమ వాసులకు సమకూర్చిన బంగారు వస్తువులను దసరా సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో యువ నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్, సౌత్ ముస్లిం మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ముజేబ్ ఖాన్, మాజీ కార్పొరేటర్ పిల్లి రమణ, బాబ్జీ, ఎర్రబిల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

బాదంతో ప్రోటీన్ సమస్యలకు చెక్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : శరీరం సక్రమంగా నడవాలంటే తీసుకునే ఆహార పదార్థాలలో ప్రోటీన్లు తప్పనిసరిగా ఉండాలని, అటువంటి ప్రోటీన్ సమస్యను నిత్యం గుప్పెడు బాదం తీసుకోవడం ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణ స్వామి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా ఆధ్వర్యంలో 'భారతదేశంలో ప్రోటీన్ సమస్య - సహజ దృక్పథం' అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ భారతీయులలో 73 శాతం మంది సరిపడినంత ప్రోటీన్ తీసుకోవడం లేదని ఓ సర్వేలో తేలిందన్నారు. 90 శాతం మందికి దీని ఆవశ్యకతపై అవగాహన లేదన్నారు.

దుర్వాసన నడుమ నిర్వాసితుల బతుకులు

సురక్షిత ప్రాంతాలకు తరలించని ప్రభుత్వం - హామీలతో నెట్టుకొస్తున్న వైనం
- మంచినీటికీ నోచుకోని ప్రజలు
ఇదీ పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్‌కు భూములిచ్చిన గ్రామాల దైన్యస్థితి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్‌కు భూములు తీసుకునే క్రమంలో కొన్ని గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా ప్రభుత్వాలు వదిలేశాయి. తరలించని గ్రామాలిప్పుడు పరిశ్రమల మధ్యన దుర్వాసన నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. భూగర్భ జలాలు కలుషితమవడంతో మంచి నీటికీ నోచుకోవడం లేదు. తాడి, చినపూడిలో వాటర్ టిన్‌లు కొనుక్కొని తాగుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు.

పరిశ్రమను ఆనుకుని ఉన్న చినపూడి

పరవాడ మండలంలోని ఫార్మా సిటీ కంపెనీలకు ఆనుకొనివున్న తాడి, అచ్యుతాపురం మండలం చినపూడి, దుప్పుతూరు, చినతాళ్లదిబ్బ గ్రామాలకు పునరావాసం కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. ఇప్పుడాగ్రామాలను తరలించకపోవడంతో పరిశ్రమల కాలుష్యంతో ప్రజలు కాలం గడుపుతున్నారు. పునరావాసం కల్పించి గ్రామాలను తరలించాలని వారు ఎంత మొత్తుకొంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు. వారం పది రోజుల్లో తాడి తరలింపునకు అవసరమైన రూ.56 కోట్లు ఇచ్చి న్యాయం చేస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. వాస్తవానికి తాడి ప్రజలకు పునరావాసం కల్పించి, తరలించడానికి ఆ నిధులు సరిపోవు. కనీసం తరలించడానికి తగిన చర్యలేవీ ఈ నాటికీ ప్రభుత్వం చేపట్టలేదు.

నిర్వాసిత గ్రామాల తరలింపు దశాబ్దాల తరబడి ఎన్నికల హామీగా ఉంటోంది తప్ప అమలుకు నోచుకోవడంలేదు. ఫార్మా కంపెనీలకు వందమీటర్ల దూరంలోని తాడి ప్రజలు పరిశ్రమల వాసన భరించలేక, రోగాలతో బాధపడలేక ఊరువదిలి వెళ్లిపోతున్నారు. భూములు వదులుకోలేక కొంతమంది కాలుష్య బాధలు భరించుకుంటూ బతుకు వెళ్లదీస్తున్నారు. తాడి, చినతాడి, బిసి కాలనీని తరలించాలని తాడి బాధితుల సంక్షేమ సంఘం నేతృత్వంలో జరిగిన పోరాటంతో టిడిపి ప్రభుత్వం ఎన్నికలకు కొద్ది రోజుల ముందు 2019 ఫిబ్రవరి 6న రూ.57.63 కోట్లు విడుదల చేస్తూ జిఒ 29 విడుదల చేసింది. ఆ తరువాత కాలంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.56 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించింది. ఈ రెండు ప్రభుత్వాలూ గ్రామాన్ని తరలించడానికి ముందు చేపట్టాల్సిన నిర్వాసితుల గుర్తింపు సర్వే ప్రారంభించలేదు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇళ్లతో పాటు భూములకు పరిహారం, అర్హులందరికీ పునరావాసం కల్పించి సురక్షిత ప్రాంతానికి తరలిస్తే వెళ్లిపోతామని తాడి, చినపూడి, దుప్పుతూరు, చినతాళ్లదిబ్బ గ్రామస్తులు చెబుతున్నారు. విద్యార్హతలున్న స్థానికులకు, నిర్వాసిత కుటుంబాలకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాల కల్పన జిఒను కంపెనీల యాజమాన్యాలు అమలుచేయడంలేదు. ప్రభుత్వమూ చిత్తశుద్ధితో అమలుచేసే పని చేయడంలేదు. గ్రామాల తరలింపు, స్థానికులకు ఉద్యోగాల కల్పనపై ఎమ్మెల్యేలు కనీస చొరవ తీసుకోవడంలేదని నిర్వాసితులు వాపోతున్నారు. నిర్వాసిత గ్రామాల తరలింపు, స్థానికులకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాల కల్పన జిఒ వంటి అమలుకాని అంశాలను సోమవారం పరవాడ, అచ్యుతాపురం వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసి వివరించాలని సిపిఎం నాయకులు చేసిన ప్రయత్నాలను ప్రభుత్వం అడ్డుకుంది. నాయకులను గృహ నిర్బంధం చేయించి, అరెస్టులు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లడంతో నిర్వాసితుల సమస్యల తీవ్రతను వెలుగులోకి రాకుండా చేసింది.

పకడ్బందీగా భారత్ - ఆసీస్ టి 20 మ్యాచ్

ప్రజాశక్తి - పిఎం.పాలెం : పకడ్బందీ ఏర్పాట్లు నడుమ భారత్ – ఆసీస్ టి 20 మ్యాచ్ నవంబర్ 23న మధురవాడలోని వైఎస్ఆర్ ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరుగనుందని నిర్వహణ కమిటీ తెలిపింది. ఈ అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహణపై మంగళవారం కమిటీ తొలి సమావేశం స్టేడియంలో జరిగింది. జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర సిపి ఎ.రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ, ఎసిఎ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ స్టేడియంలో పలు మ్యాచ్‌లను సమర్థవంతంగా నిర్వహించామన్నారు. భారత్, ఆసీస్ మధ్య జరిగే మ్యాచ్‌కు సంబంధించి టిక్కెట్ల ధరలు, అమ్మకాలపై మరోసారి భేటీ అయ్యి నిర్ణయం తీసుకుంటామన్నారు. టికెట్ల పంపిణీలో పారదర్శకంగా వ్యవహరిస్తామన్నారు. విక్రయాలలో సామాన్యులకు పెద్ద పీట వేస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్టేడియం సామర్థ్యం 27 వేల మందికే పరిమితం కావడంతో టికెట్ దొరక్కపోవడంతో మ్యాచ్‌ను తిలకించలేని క్రికెట్ అభిమానులు నిరుత్సాహపడకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

దాదాపు పది వేల మంది మ్యాచ్‌ను చూసేందుకు ఆర్‌కె బీచ్‌లో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేసేందుకు అపెక్స్ కౌన్సిల్ ఆలోచిస్తోందన్నారు. విశాఖలో 40 వేల పైచిలుకు మంది పట్టేలా మరో అంతర్జాతీయ స్టేడియం నిర్మాణానికి కసరత్తు ప్రారంభించామన్నారు. నిర్వహణ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ టికెట్ల అమ్మకాల వద్ద రెవెన్యూ అధికారిని నియమించి విక్రయాలు సజావుగా సాగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ పృథ్వీతేజ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

విశాఖ పోర్టుతో పలు సంస్థలు ఎంఒయులు

- ముంబయి గ్లోబల్ సమ్మిట్ వేదికగా సంతకాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ముంబయిలో జరుగుతున్న గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్‌లో విశాఖపట్నం పోర్టు అథారిటీ, పలు సంస్థల మధ్య ఎంఒయులు కుదిరాయి. కేంద్ర పోర్టులు నౌకా జలరవాణా శాఖా మంత్రి శరబానంద్ సోనోవాల్ సమక్షంలో మంగళవారం కొన్ని ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోడీ ముంబయిలో జరుగుతున్న గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ 2023ను ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించగా విశాఖ నుంచి పలువురు అధికారులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ రెండు ఎంఒయులను కుదుర్చుకుంది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రస్తుతం కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకూ ఉన్న నాలుగు లైన్ల రోడ్డును ఆరులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. అందుకోసం పోర్టు రూ.501 కోట్లను వెచ్చించనుంది.

నేవీతో ఒప్పందం

ఔటర్ హార్బర్‌ను అభివృద్ధి చేసేందుకు ఇండియన్ నేవీతో పోర్టు మరో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఔటర్ హార్బర్‌లో నేవీ పలు అభివృద్ధి పనులు చేపట్టనుంది.రెండు ఎంఒయూలపై పోర్టు తరపున ఛైర్మన్ డాక్టర్ ఎం.ఆంగముత్తు, డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా తరపున ఎంకె వాతోర్, జోనల్ ఆఫీసర్, వెస్ట్ జోన్, నేవీ తరపున అడ్మిరల్ నెల్సన్ డిసౌజా సంతకాలు చేశారు.

ట్రయాన్ సంస్థతో పోర్టు ఒప్పందం

ట్రయాన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పోర్టుకు ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా పోర్టు శాలిగ్రామపురంలోని భూమిని ట్రయాన్ సంస్థకు దీర్ఘకాలిక లీజుకు ఇవ్వనుంది. ఒప్పందం విలువ 900 కోట్ల రూపాయలు. ఒప్పందంలో భాగంగా కన్వెషన్షన్ సెంటర్లు, ఐటి టవర్లు నిర్మించనున్నారు. పోర్టు తరపున ఛైర్మన్ అంగముత్తు, ట్రయాన్ సంస్థ తరపున రజనీష్ మహాజన్, డైరెక్టర్‌లు సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పోర్టు స్టాల్

గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ – 2023లో భాగంగా విశాఖపట్నం పోర్టు ఏర్పాటు చేసిన స్టాల్ ఆహూతులను అమితంగా ఆకట్టుకుంటోంది. ప్రపంచం నలుమూలల నుంచి సమ్మిట్‌కు విచ్చేసిన ప్రతినిధులు విశాఖపట్నం పోర్టు స్టాల్‌ను సందర్శించి పోర్టు అధికారులతో సంప్రదింపులు జరిపారు. వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకునేందుకు విశాఖపట్నం పోర్టులో ఉన్న అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎపి ప్రభుత్వంతో కలిసి ప్రత్యేకంగా స్టేట్ సెషన్ నిర్వహించింది. ఈ సెషన్‌ను అంగముత్తు ప్రారంభించారు. ఎపి రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, పెట్టుబడులు వాణిజ్యం, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడారు.

జగన్ టీంలో అందరూ సైకోలే

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఖ్యమంత్రి. జగన్మోహన్ రెడ్డి టీంలోని వారందరూ సైకోలేనని తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ సైకోలా ప్రవర్తిస్తున్నారని, మంత్రులు కూడా అలాగే మారిపోయారని అన్నారు. 37 రోజులుగా చంద్రబాబును జైల్లో పెట్టి హింసిస్తున్నారని తెలిపారు. సజ్జల, డిప్యూటీ సిఎం నారాయణ స్వామి భువనేశ్వరిపై పిచ్చి కూతలు కూస్తున్నారని తెలిపారు.